

# ఎలిజీలు

## – గొల్లపూడి మారుతీరావు



*కౌముది ప్రారంభసంచిక నుంచి క్రమం తప్పకుండా కనిపిస్తున్న పేరు ఆత్మీయ మిత్రులు గొల్లపూడి మారుతిరావు గారు. ఆయన వ్రాసిన ఎన్నో నవలలు, కథలు , వ్యాసాలు, కాలంస్ కౌముదిలో వచ్చాయి. ఆనవాయితీ తప్పకుండా వారు వ్రాసిన ఎలిజీలు వ్యాసాలను నెలకొకటి చొప్పున పునర్ముద్రిస్తున్నాము. గొల్లపూడి మారుతిరావుగారు భౌతికంగా మన మధ్యన లేకపోయినా ఆయన అశీస్సులు కౌముదిని సదా వెన్నంటే ఉంటాయి.*

*(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)*

# మాట్లాడిన మల్లెమొగ్గ

యూనివర్సిటీలో చదువుకునే రోజుల్లో కె.వి.గోపాలస్వామిగారి ఆధ్వర్యంలో జరిగే ఆంధ్రాభ్యుదయోత్సవాలలో ఇద్దరు తెలంగాణ యువకులు వచ్చారు. వారి పేర్లు కూడా అప్పట్లో మేం వినలేదు. ఒకాయన పొట్టిగా, గట్టిగా మీద కెగిసే నిప్పురవ్వలా ఉన్నాడు. మరొకాయన ఉంగరాల జుత్తు, తీర్చిదిద్దిన పుష్పగుచ్చంలాగా ఉన్నాడు. పొట్టి ఆయన పేరు దాశరథి. పుష్పగుచ్ఛం పేరు సి.నారాయణరెడ్డి.

మిత్రుడు మోదుకూరి జాన్సన్ (అవును, ఆ తర్వాత గొప్ప సినీరచయిత) వేదిక ఎక్కి దాశరథిగారి గీతం ఒకటి పాడారు. – అద్భుతంగా, పాట ఎంత గొప్పదో, పాడడమూ అంత గొప్పగా సాధించాడు జాన్సన్.

**మాట్లాడని మల్లెమొగ్గ మాదిరిగా నడిచిరా**

**నిశ్శబ్దం ఎరుగనట్టి నిమ్నగ వలె విడిచిపో**

నాకనిపిస్తుంది – దాశరథిగారి జీవితం ఆ పాటకి విపర్యయం అని. ఆయన నిశ్శబ్దం ఎరుగనట్టి నిమ్నలాగ సాహితీ ప్రపంచంలోకి – ఆ మాటకి వస్తే – తెలంగాణ ఉద్యమంలోకి దూకారు.

నా తెలంగాణ కోటి రతనాల వీణ – అని బోర విరుచుకోవడంలో రవీంద్రుని స్థాయి దేశాభిమానం కనిపిస్తుంది నాకు.

"మా నిజామురాజు యుగయుగాల బూజు" అనడంలో అక్టోబరు విప్లవం వెనకనున్న ఆవేశం స్ఫురిస్తుంది.

దాశరథిగారితో ఆలిండియా రేడియోలో పనిచేసే అదృష్టం కలిగింది నాకు. ఆ రోజుల్లో ఆ ఉద్యోగానికి 'రుచి' ఇచ్చిన వారిలో మిత్రులు దాశరథిగారొకరు. జీవితమంతా "అండర్ డాగ్" కోసం నిలబడిన సాహసి. స్నేహానికి ఆయన ప్రాణం ఇచ్చేవారు. నాకంటే సాహితి వ్యవసాయంలో ఎత్తయిన మనిషి. కానీ జీవితంలో, నిత్యజీవనంలో ఎప్పుడు పలకరించినా తన ఎత్తుకి నన్నూ సాగదీసేవారు.

అప్పట్లో నేనింకా సాహితీరంగంలో దాదాపు ప్రారంభదశలోనే ఉన్నవాడిని. దాశరథిగారిలాంటి వారి మెప్పు, ప్రోత్సాహం ఎంతో గుండె బలాన్నిచ్చేది.

ఆయన సాహిత్యం ఎంత సరళమో, అంత ఆవేశపూరితం. మనిషి, మనసు అంత మృదువు. అయితే పట్టుదల వస్తే ముందు వెనకలు చూడకుండా దూకేసే మనస్తత్వం. జీవితంలో వెనక్కి తిరిగి చూడడం అలవాటు లేని కారణాన చాలా నష్టపోయిన మనిషి. సినిమా స్నేహాల్ని, సినిమా ప్రవేశాన్నీ నమ్ముకుని ఉద్యోగానికి విడాకులిచ్చారు.

**కొత్తపాట పేరుతో చెత్త పాట పాడకు**

**కొత్తదనం పేరుతో రిత్తదనం పెంచకు**

అని చెప్పడమే కాదు, సినీమా పాటలో కూడా చేసి చూపించిన నిజాయితీ పరుడయిన కవి దాశరథి.

**కౌగిలిలో ఒదిగిపోయి కలలుగనే వేళాయె**

**ఎదురుచూసి ఎదురు చూచి కన్నుదోయి అలసిపోయె**

అన్న చరణం ఉన్న సినిమా పాట వ్రాశారంటే నానా చెత్తా విని ఆనందించే ఈనాటి సినీ ప్రేక్షకులు ఆశ్చర్యపోతారు.

కవిత్వాన్ని నమ్ముకోవడమేగాని కవిత్వాన్ని అమ్ముకోవడం తెలీని మనిషి. అందుకే సినీ ఒరలో ఇమడలేకపోయారు. ఇచ్చకాలూ, ముఖప్రీతి మాటలూ తెలీని మనిషి. అందుకే చాలా మందితో చాలా కటువుగా తగాదా పడ్డారు. ఆయన హైదరాబాద్ ఆకాశవాణిలో నాటకశాఖ ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్. స్థానం నరసింహారావుగారు ప్రొడ్యూసర్. స్థానం లౌక్యులు. ఎందుకనో ఇద్దరికీ పడేది కాదు. తన 'విముఖత'ని దాచుకోవడం కూడా తెలీని మనిషి దాశరథిగారు.

సినిమాల కోసం మద్రాసు బదిలీ చేయించుకు వచ్చారు. సినిమా సాహిత్యం స్థాయిని పెంచారు కానీ, బ్యాంకు అకౌంట్ పెంచుకోలేకపోయారు. నేనెప్పుడు మద్రాసు వచ్చినా ఆదరంగా నన్ను స్టూడియోకి తీసుకెళ్ళి నా చేత కథలు చదివించి రికార్డు చేసేవారు.

పారశీక సాహిత్యం మీద, గజల్స్ మీద, రుబాయీల మీద అనర్గళమయిన పట్టు ఉన్న మనిషి. నేను మద్రాసులో ప్రోగాం ఎగ్జిక్యూటివ్‌గా ఉన్నప్పుడు పారశీక, ఉర్దూ సాహిత్యాల మీద ఎన్నో ప్రసంగాలు చేయించారు. ఆయన ఉత్తరాలలో ఎప్పుడూ "తమ్ముడూ" అనే సంబోధన. అప్పుడప్పుడు 'మిత్రమా' అంటూ. సరదా పుట్టినప్పుడూ ఉత్తరాలలో శ్రీనాథుడయేవారు.

నాకు సాహిత్య అకాడమీ బహుమతి వచ్చినందుకు నాకన్నా ఎక్కువ గర్వపడ్డారు.

ఓ రోజు హైదరాబాదు ఆకాశవాణిలో తారసపడి "అబ్బాయ్, నిన్న అన్నపూర్ణ సంస్థ దుక్కిపాటి మధుసూదనరావుగారు కలుసుకోవాలనుకుంటున్నారు" అన్నారు.

తుళ్ళిపడ్డాను. దుక్కిపాటి వారు ప్రముఖ నిర్మాత.

"ఆయన నన్ను కలుసుకోవడం ఏమిటి? నేనే ఆయన్ని కలుస్తాను" అన్నాను.

దాశరథిగారు నవ్వి: "అవసరం ఆయనది. ఆయనే రావాలి. నీ ఇల్లెక్కడో చెప్పు" అన్నారు.

దుక్కిపాటి వారిని మా ఇంటికి స్వయంగా తీసుకొచ్చి పరోక్షంగా నా సినీజీవితానికి శ్రీకారం చుట్టారు. జీవితంలో తప్పటడుగులు, తప్పుటడుగులు వేసినప్పుడు ఉత్తరాల ద్వారా మందలించిన హితైషి.

ఆయన ఎంత చిన్న పనిచేసినా కొండంత మనస్సుతో చేసేవారు. ఆయన చేసే ఏ చిన్న పనయినా కొండంతలుగా ఆఫీసులో రెచ్చగొట్టేవారు. మద్రాసు నుంచి ఆయనకి బదిలీ అయినప్పుడు చాలా పెద్ద పెద్ద రాజకీయ నాయకులే అడ్డుపడ్డారు. అయితే ఢిల్లీ ఆకాశవాణిలోని అధికార "గుమాస్తా"లకి అది మంటగా ఉండేది. బదిలీ తప్పని సరయినప్పుడు తప్పదంటూ ఉద్యోగానికి రాజీనామా చేశారు. మాలాంటి వాళ్ళం ఎవ్వరం ఆయన్ని ఆపలేకపోయాం.

అనుకున్నట్టు సినిమా ఆయన్ని పోషించలేకపోయింది. కారణం ఆయన లౌక్యుడు కాడు. సినిమాలో పాట వ్రాయడం చాలదు. వ్రాసింది గొప్ప పాటని పాటంటే తెలీని చాలామందిని ఒప్పించాలి. ఎక్కువమందిని నొప్పించకూడదు. ఇవన్నీ దాశరథిగారికి తెలీని విషయాలు.

ఏమయినా మద్రాసు సినీజీవితంలో ఇమడలేక, హైదరాబాదుకి కుటుంబాన్ని తరలించారు. ఆరోగ్యమూ దెబ్బతింది. ఎప్పుడు మద్రాసు వచ్చినా ఆప్యాయంగా పలకరించేవారు. నేనూ, సవేరాకి వెళ్ళి ఆయన్ని కలిసేవాడిని.

ఓసారి సినీ హీరో కృష్ణంరాజుగారు కొందరిని అమెరికా పంపించేందుకు చేసిన ఏర్పాటు సభలో దాశరథిగారు కూడా ఉన్నారు. మేమిద్దరం కారులో వెళ్తుంటే "ఆరోగ్యం బాగుండడం లేదబ్బాయి. అమెరికా వెళ్ళడానికి పై ఖర్చులకి డబ్బులు లేవు. ఏదో వెళ్తున్నాను" అంటూంటే నిజాము రాజుని పునాదుల్లోంచి కదిపిన ఉద్యమకారుడు ఇంత సాధువు కావడం నన్ను బాధపెట్టింది.

ఓసారి నాతో అన్నారు: "ఉద్యోగం మాని తొందరపడ్డాను. నువ్వలాంటి పని చెయ్యకు" అని.

చివర చివర ఆయన ఆర్థికమయిన, శారీరకమయిన ఇబ్బందులూ రచన మీద మొగ్గ చూపాయనీ నాకనిపిస్తుంది. జీవితం - ఎక్కడో గర్వంగా, హుందగా నడిచే వ్యక్తి మీద దెబ్బతీసింది. పద్మశ్రీ, కళాప్రపూర్ణ, ఆస్థాన కవి బిరుదులు ఆయన్నెప్పుడూ తల్లకిందులు చెయ్యలేదు. వాటి ప్రసక్తి ఎప్పుడు వచ్చినా నాలుక చప్పరించేవారు.

వ్యక్తిగా, సాహితీ ద్రష్టగా చాలా ఉన్నతమయిన వ్యక్తి.

మరొక్కసారి అంటాను దాశరథిగారు తన పాటకి విపర్యంలాగా బ్రతికారు.

నిశబ్దం ఎరుగనట్టి నిమ్నగలాగా సాహితీవనంలోకి ప్రవేశించి మాట్లాడని మల్లెమొగ్గలాగ శెలవు తీసుకున్నారు.

*(వచ్చే నెలలో మరో ఎలిజీ)*

Post your comments